నమస్తే తెలంగాణ
వికారాబాద్
I | హైదరాబాద్, మంగళవారం 13 ఆగస్టు 2024 | VIKARABAD

'అమ్మ ఆదర్శ పాఠశాల' పనుల్లో వేగం పెంచాలి

వికారాబాద్, ఆగస్టు 12 : అమ్మ ఆదర్శ పాఠశాల పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. సోమవారం జిల్లా సమాఖ్య అధ్యక్షులతో ఆయన సమావేశమై బడుల్లో జరుగుతున్న పనుల పురోగతిపై మండలాలవారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిధులు దుర్వినియోగం కాకుండా పనులు చేయించాలని ఆదేశించారు. మండల సమాఖ్య సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. పాఠశాలవారీగా వసతుల కల్పనకు వెచ్చించిన నిధుల వివరాలను పంపించాలన్నారు. అనంతరం స్కూళ్లకు అందజేయాల్సిన లైట్లు, ఫ్యాన్లను పరిశీలించారు. సమావేశంలో డీఆర్‌డీఏ శ్రీనివాస్ , అడిషనల్ డీఆర్‌డీవో సరోజ , జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు అలివేలు, ఐకేపీ సమాఖ్య అధక్షులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

స్వాతంత్ర్య దినోత్సవానికి ఘనంగా ఏర్పాట్లు చేయాలి

రంగారెడ్డి, ఆగస్టు 12(నమస్తే తెలంగాణ) : స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ శశాంక సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఆయన జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొంగరకలాన్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవన ఆవరణలో నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవానికి హాజరయ్యే వీఐపీలు, అధికారులు, మీడియా, ఇతరులకు సీటింగ్ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. వేడుకల ఏర్పాట్లలో ఎక్కడ ఎలాంటి పొరపాట్లు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు ప్రతిమాసింగ్, భూపాల్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, జిల్లా పరిషత్ సీఈవో కృష్ణారెడ్డి, జిల్లా అధికారులు , పోలీసు, అగ్నిమాపక శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

'మెట్రో డీలక్స్‌లో లేడీస్‌కు నో ఫ్రీ

సిటీబ్యూరో, ఆగస్టు 12 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్‌లో కొత్తగా వచ్చిన మెట్రో డీలక్స్ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణానికి అనుమతి లేదని, టికెట్ ధర చెల్లించాల్సిందేనని ఆర్టీసీ అధికారులు స్పష్టం చేశారు. ఇటీవల హైదరాబాద్, సికింద్రాబాద్‌లో నూతనంగా 24 మెట్రో డీలక్స్ బస్సులను ఆర్టీసీ ప్రారంభించింది. అయితే ఈ సర్వీసుల్లో ఉచిత ప్రయాణం లేకపోవడంతో మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టికెట్ ఎందుకు తీసుకోవాలంటూ కండక్టర్లతో ఘర్షణ పడుతున్నారు. కేవలం ఆర్డినరీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అనుమతిచ్చి.. మెట్రో బస్సుల్లో నిరాకరించడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మెట్రో డీలక్స్‌లలో మహిళలకు ఉచిత ప్రయాణం లేదని గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలో మరో 110 కొత్త మెట్రో బస్సులు రాబోతున్నట్టు వెల్లడించారు.

టీ హబ్‌లో మ్యాథ్ హ్యాక్

సిటీబ్యూరో, ఆగస్టు 12 (నమస్తే తెలంగాణ): కొత్తగా అభివృద్ధి చెందుతున్న కృత్రిమ మేధ, మిషిన్ లెర్నింగ్‌లో సరికొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించడమే లక్ష్యంగా సోమవారం టీ హబ్‌లో మ్యాథ్ హ్యాక్ ప్రారంభమైంది. 36 గంటల పాటు కొనసాగే ఈ మ్యాథ్‌హ్యాక్‌లో ఆవిష్కరణలు చేయాలనుకునే విద్యార్థులు, స్టార్టప్స్, డెవలపర్స్‌తో కార్యక్రమాన్ని టీ హబ్ సీఈవో ఎం.ఎస్.రావు ప్రారంభించారు.

ఒకప్పుడు లేక్‌సిటీగా పేరొందిన భాగ్యనగరం.. క్రమంగా ఆ ఖ్యాతి.. 'కబ్జాల' కాలగర్భంలో కలిసిపోతున్నది. గడిచిన 44 ఏండ్లలో అనేక చెరువులు కనుమరుగైనట్లు నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్(ఎస్ఆర్ఎస్‌సీ) నివేదిక వెల్లడించింది. మహానగరంలో 60 శాతానికి పైగా తటాకాలు అన్యాక్రాంతమయ్యాయని తేల్చింది. కంటి ముందే కనుమరుగైపోతున్న జలవనరులను పరిరక్షించకపోతే.. భవిష్యత్తులో హైదరాబాద్ పరిస్థితి ప్రశ్నార్థకంగా మారనున్నది.

ఎస్ఆర్ఎస్‌సీ నివేదిక

చెరువు.. కబ్జా దరువు

60 శాతానికిపైగా చెరువులు అన్యాక్రాంతం

"నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎస్ఆర్ఎస్‌సీ) నివేదిక ప్రకారం 44 ఏండ్లలో చాలా చెరువులు కనుమరుగయ్యాయి. ఇందులో అనేక చెరువులు 60 శాతం, 80 శాతం, కొన్ని చోట్ల వందకు వంద శాతం కబ్జాలకు గురయ్యాయి. ఆక్రమణలు అడ్డుకోకపోతే హైదరాబాద్ పరిస్థితి ప్రశ్నార్థకంగా మారుతుంది. ఎక్కువగా 61 శాతానికి పైగా చెరువులు కబ్జాకోరల్లో ఉన్నాయి. వాటిపై విడుతల వారీగా చర్యలు తీసుకోబోతున్నాం. పేదవాళ్ల ముసుగులో కబ్జాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతాం. త్వరలోనే హైడ్రాకు ప్రత్యేక పోలీస్‌స్టేషన్ ఏర్పాటు కానున్నది".

-హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్

44 ఏండ్లలో అనేక తటాకాలు కనుమరుగు

ప్రశ్నార్థకంగా నగర భవిష్యత్

సిటీబ్యూరో: లేక్ సిటీగా పేరొందిన హైదరాబాద్‌లో చెరువులు, కుంటలు లేకుండా పోతున్నాయి. యథేచ్ఛగా పెరుగుతున్న జనారణ్యంలో భావితరాలకు చెరువులంటే ఎలా ఉంటాయో తెలుసుకోలేని పరిస్థితులు వస్తున్నాయి. తాజాగా మహానగరంలో అన్యాక్రాంతమైన చెరువులపై నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎస్ఆర్ఎస్‌సీ) నివేదిక రూపొందించింది. ఈ జాబితాలో 44 ఏండ్లలో చాలా తటాకాలు కనుమరుగైనట్లు తేల్చింది. మూడు జిల్లాల పరిధిలో విస్తరించి ఉన్న చెరువుల వాస్తవ, ప్రస్తుతం ఉన్న విస్తీర్ణంతో కూడిన సమాచారాన్ని శాటిలైట్ డేటా ద్వారా సేకరించింది. మహానగరంలో 60 శాతానికి పైగా చెరువులు కబ్జాకు గురైనట్లు తేల్చింది.వీటిపై విడుతల వారీగా చర్యలు తీసుకుంటాయని హైడ్రా కమిషనర్ రంగనాథ్ సైతం స్పష్టం చేశారు. జలవనరులను పరిరక్షించుకోకపోతే... భవిష్యత్తులో హైదరాబాద్ పరిస్థితి ప్రశ్నార్థకంగా మారనుంది.

ఎవరినీ వదిలిపెట్టం..

మూడు దశల్లో హైడ్రా కార్యాచరణ
త్వరలోనే హైడ్రాకు స్పెషల్ పోలీస్‌స్టేషన్
అక్రమ నిర్మాణాలకు అనుమతి, ఓసీలు జారీ చేసిన అధికారులపై చర్యలు
హెచ్చరించిన కమిషనర్ రంగనాథ్

'చెరువులు, నాలాలు, పార్కులు, ఖాళీ స్థలాలు కబ్జా చేసి నిర్మాణాలు చేపడితే బాధ్యులపై చర్యలు తప్పవు. కబ్జాలో ఉన్న ఏ ఒక్కరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదు' అని హెచ్చరించారు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్. ప్రభుత్వ ఆస్తులు రక్షణ, చెరువుల పరిరక్షణ ధ్యేయంగా హైడ్రా పనిచేస్తుందని, అక్రమ నిర్మాణాలను కూల్చివేయడంతో పాటు భూ కబ్జాలో ప్రమేయం ఉన్న వారం దరిపై చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. బుద్ధభవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హైడ్రా కార్యాచరణపై కమిషనర్ రంగనాథ్ మాట్లాడుతూ.. మూడు దశల్లో కార్యాచరణ రూపొందించుకొని హైడ్రా పనిచేస్తుందని వివరించారు. తొలి విడుతలో చెరువులు, నాలాలు, పార్కుల్లో కొత్తగా కబ్జాలకు ఆస్కారం లేకుండా ఫోకస్ పెడుతామని , సీసీ కెమెరాల ఏర్పాటు, ప్రత్యేక సిబ్బందితో నిఘా వ్యవస్థ ఏర్పాటు చేస్తామని, కాలనీల సహకారం తీసుకుంటామని చెప్పారు. స్థానిక ప్రజల్లో జీవన ప్రమాణాలు పెంపొందించడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. రెండో విడుతలో అప్పటికే ఏర్పడిన భవన, వ్యాపార నిర్మాణాలపై దృష్టి సారిస్తామని, అక్రమ నిర్మాణాలను సమూలంగా కూల్చివేసి.. భవిష్యత్‌లో కబ్జా చేయాలంటే భయపడే పరిస్థితిని తీసుకొస్తామన్నారు. మూడో విడుతలో చెరువుల పరిరక్షణలో భాగంగా బెంగళూరు తరహాలో చెరువులను సుందరీకరణ చేసి పునరుజ్జీవం పోస్తామని తెలిపారు. గొలుసుకట్టు చెరువుల న్నింటినీ పునరుద్ధరిస్తామని, వరద నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకుంటామన్నారు. లోటస్‌పాండ్, గాజుల రామారం, చందానగర్, నందగిరి హిల్స్, పాతనగరంలోని పలు ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకున్నామన్నారు. చెరువులు, పార్కులు, ఖాళీ స్థలాలు, నాలా కబ్జాలపై హైడ్రాకు 40-50 దాకా ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ప్రభుత్వ ఆస్తులు, స్థలాలు, చెరువులు, పార్కు స్థలాలు, బఫర్ జోన్లలో భూ ఆక్రమణలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కొన్ని చోట్ల భవన నిర్మాణం పూర్తి కాకముందే ఓసీ సర్టిఫికెట్లను జారీ చేయడం, బఫర్ జోన్‌లో ఇరిగేషన్ ఎన్‌వోసీ లేకుండానే అనుమతులు ఇచ్చారని, బాధ్యులపై చర్యలు ఉంటాయని చెప్పారు.

త్వరలోనే ప్రత్యేక పోలీస్‌స్టేషన్

హైడ్రాకు ప్రత్యేక పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేస్తామని, మూడు జోన్లుగా విభజించి.. ఏసీపీ స్థాయి అధికారి పర్యవేక్షణలో పనిచేస్తుందన్నారు. ప్రభుత్వం ఏటా హైడ్రాకు రూ.200కోట్ల మేర నిధులు ఇవ్వనుందని, త్వరలోనే 3500 మంది సిబ్బందిని నియమించుకుంటామని చెప్పారు. డీఆర్ఎఫ్‌తో పాటు కబ్జాల నియంత్రణపై ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు బాధ్యతాయుతంగా ఉండాలని, హైడ్రా కార్యాచరణలో భాగస్వామ్యం కావాలని సూచించారు. ప్లాట్లు, ఫ్లాట్లు కొనుగోలు చేసే ముందు ప్రజలు అన్ని రకాల అనుమతులను పరిశీలించి కొనుగోలు చేయాలన్నారు. కబ్జాలు లేని హైదరాబాద్‌ను తీర్చిదిద్దడమే లక్ష్యంగా, అత్యంత పారదర్శకంగా హైడ్రా పనిచేస్తుందన్నారు.

కబ్జా కోరల్లో చిక్కిన చెరువుల జాబితా ఇదే..

చెరువు	తగ్గిన విస్తీర్ణం
తుమ్మలకుంట	100శాతం
పెద్ద చెరువు	96శాతం
మిర్యాలగూడ చెరువు	90శాతం
నల్ల చెరువు	90శాతం
కుంట్లూరు పెద్ద చెరువు	90శాతం
కొంపల్లి లేక్ - 1	88శాతం
ఖాజాగూడ లేక్	88శాతం
యాప్రాల్ చెరువు	86శాతం
గుర్రం చెరువు	85శాతం
జిల్లెలగూడ లేక్	85శాతం
కొంపల్లి లేక్	84శాతం
రామాంతపూర్ చెరువు 1	84శాతం
బండ్లగూడ లేక్	83శాతం
పల్లె చెరువు	82శాతం
ఓల్డ్ అల్వాల్ చెరువు	82శాతం
ఇంజాపూర్ చెరువు	80శాతం
అల్వాల్ లేక్	78శాతం
తూంకుంట లేక్	77శాతం
మంత్రాల చెరువు	76శాతం
దూలపల్లి లేక్	76శాతం
పిర్జాదీగూడ లేక్	73శాతం
బాతుల చెరువు	72శాతం
రామకృష్ణాపురం చెరువు	71శాతం
పెద్దచెరువు	71శాతం
సల్కం చెరువు	70శాతం
కౌకూర్ లేక్	69శాతం
పెద్ద చెరువు	69శాతం
సఫిల్‌గూడ లేక్	66శాతం
దమ్మాయిగూడ లేక్	64శాతం
గుండ్లపోచంపల్లి లేక్-1	64శాతం
కౌకూర్ చెరువు	64శాతం
కప్పల చెరువు	64శాతం
పోతాయిపల్లి లేక్	61శాతం
సాయినగర్ చెరువు	60శాతం
బోన్ చెరువు	57శాతం
అన్నరాయన్ చెరువు	56శాతం
సరూర్‌నగర్ చెరువు	56శాతం
చెంగిచర్ల లేక్	53శాతం
రామాంతాపూర్ చెరువు	51శాతం
ఓవైసీ లేక్	45శాతం
నాగారం లేక్	45శాతం
నాగోల్ లేక్	41శాతం
దమ్మాయిగూడ చెరువు	35శాతం
రామ చెరువు	33శాతం
మీరాలం చెరువు	32శాతం
జల్‌పల్లి లేక్	31శాతం
గుండ్లపోచంపల్లి లేక్-2	30శాతం

టీచర్ల కొరత

కొడంగల్ మండలం ధర్మాపూర్ గ్రామ పాఠశాల ఉపాధ్యాయుడు డిప్యూటేషన్‌పై ఇతర ప్రాంతంలో విధులు నిర్వహించారు. ఇటీవల ట్రాన్స్‌ఫర్ కావడంతో ఖాళీ కాగా ఇక్కడ చదివే 12 మంది విద్యార్థులు ప్రస్తుతం అంగడిరాయచూరు పాఠశాలలో చేరారు. అదేవిధంగా దౌల్తాబాద్ మండలంలోని బిచ్చాల్ తండాలోనూ టీచర్ పోస్ట్ ఖాళీగా ఉన్నది. ఇక్కడ 15 మంది విద్యార్థులు ఉండగా.. ప్రత్యేక ఉపాధ్యాయుడితో కొనసాగిస్తున్నారు. ఇలా జిల్లావ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

- వికారాబాద్ జిల్లాలో వెయ్యికి పైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ
- 649 ఎస్జీటీలు, 301 భాషా పండితులు, 35 సింగిల్ టీచర్ బడుల్లో ఖాళీలు
- సింగిల్ టీచర్ స్కూళ్లలో పదోన్నతులు పొందినా నో రిలీవ్
- జీరో ఎన్‌రోల్‌మెంట్‌తో మూతబడే దిశగా 32 స్కూళ్లు
- సీఎం నియోజకవర్గం కొడంగల్‌కే విద్యావలంటీర్లు

వికారాబాద్, ఆగస్టు 12 (నమస్తే తెలంగాణ): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉన్నది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఖాళీలను ప్రభుత్వం భర్తీ చేయడం లేదు. కొన్ని చోట్ల ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలను ఒకరిద్దరు ఉపాధ్యాయులతోనే కొనసాగిస్తున్నారు. యూపీఎస్‌లో ఇద్దరు స్కూల్ అసిస్టెంట్లు, ఇద్దరు భాషా పండితులు ఉండాల్సి ఉండగా..చాలా స్కూళ్లలో ఒక్కరిద్దరితోనే నడిపిస్తున్నారు. మరికొన్ని స్కూళ్లలో సింగిల్ టీచర్‌తోనే కాలం వెళ్లదీస్తున్నారు. ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల పదోన్నతులతో జిల్లాలో భారీగా ఖాళీలు ఏర్పడ్డాయి. గతంలో ఉన్న ఉపాధ్యాయ ఖాళీలతో పోలిస్తే ప్రస్తుతం మరిన్ని పెరిగాయి. భాషాపండితులు, ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు రావడంతో చాలా స్కూళ్లలో ఖాళీలు ఏర్పడ్డాయి. అయితే ఉపాధ్యాయుల కొరతతో పదోన్నతులు వచ్చిన సింగిల్ టీచర్ స్కూళ్ల నుంచి ఇప్పటికీ ఉపాధ్యాయులను రిలీవ్ చేయలేదు. మరోవైపు జీరో ఎన్‌రోల్‌మెంట్ స్కూళ్లు ఇప్పటికే మూతబడ్డాయి. ప్రభుత్వ స్కూళ్లలో మౌలిక వసతుల కల్పనకు రూ.కోట్లు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి చర్యలు చేపట్టకపోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో వెయ్యికిపైగా ఖాళీలు...

జిల్లాలో 649 ఎస్జీటీలు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు పొందారు. వీరిలో లోకల్ బాడీ కింద పనిచేసే ఉపాధ్యాయులు 624 మంది ఉండగా, 25 మంది ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఎస్జీటీలు ఉన్నారు. స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు రావడంతో సంబంధిత పోస్టులు ఖాళీగా మారాయి. 338 మంది భాషా పండితులు ఉండగా.. ఇందులో అప్‌గ్రేడైన 301 మంది భాషా పండితుల పోస్టులూ ఖాళీ అయ్యాయి. అదేవిధంగా మల్టిపుల్ ప్రమోషన్లతో 20-30 స్కూల్ అసిస్టెంట్లు ఖాళీలున్నాయి. ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు.. ఫిజికల్ సైన్స్, గణితం సబ్జెక్టులను ఎంపిక చేసుకునే వీలుండడంతో రెండు సబ్జెక్టులకు రెండు చోట్ల ఆప్షన్లు పెట్టుకొని ఒకే చోట విధుల్లో చేరడంతో మిగతా చోట ఖాళీలు ఏర్పడ్డాయి. మరోవైపు జిల్లావ్యాప్తంగా సింగిల్ టీచర్ ఉన్న స్కూళ్లు 35 ఉండగా, పదోన్నతులు పొందిబదిలీ అయినప్పటికీ టీచర్ల కొరతతో తప్పనిసరిగా మూతబడాల్సిన పరిస్థితి ఉండడంతో సింగిల్ టీచర్ స్కూళ్లలో పదోన్నతులు వచ్చిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయకపోవడం గమనార్హం. ఇక డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా 367 పోస్టుల ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేయడంతోపాటు పరీక్షను కూడా నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఇప్పటికే జారీ చేసిన నియామకాల్లోనూ వర్తింపజేస్తామని ప్రభుత్వం ప్రకటించిన దృష్ట్యా డీఎస్సీ ఫలితాలు ఇప్పట్లో వచ్చే అవకాశం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

సీఎం నియోజకవర్గంలోనే ..

సీఎం రేవంత్‌రెడ్డి కేవలం తాను ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గానికి మాత్రమే ప్రాధాన్యత నిస్తూ, వికారాబాద్ జిల్లాలోని పరిగి, వికారాబాద్, తాండూరు నియోజకవర్గాలకు అన్యాయం చేస్తున్నారు. ఇప్పటికే అభివృద్ధి విషయంలో తారతమ్యం చూపిస్తూ కేవలం కొడంగల్‌కే రూ.వేల కోట్ల అభివృద్ధి కార్యక్రమాలను మంజూరు చేస్తున్న సీఎం.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల విషయంలోనూ ఇదే విధంగా వ్యవహరిస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఉపాధ్యాయుల కొరతతో జిల్లావ్యాప్తంగా చాలా ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్ల కొరత వేధిస్తుండడంతో ఈ విద్యాసంవత్సరం ప్రారంభం నుంచి విద్యావలంటీర్లను నియమించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. అయితే ప్రభుత్వం కేవలం కొడంగల్ నియోజకవర్గం వరకు మాత్రమే అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల నియామకానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. కొడంగల్, బొంరాసుపేట, దుద్యాల, దౌల్తాబాద్ మండలాల్లోని 52 ప్రభుత్వ స్కూళ్లలో అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించుకునేందుకు వెసులుబాటు కల్పించింది. అయితే ఎక్కువగా ఖాళీలున్న ప్రాథమిక పాఠశాలల్లో కాకుండా కేవలం ప్రాథమికోన్నత, జడ్పీహెచ్ఎస్ పాఠశాలల్లోనే అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించేందుకు ఉత్తర్వులిచ్చింది. అదేవిధంగా అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల నియామకానికిగాను ఎంపీడీవో, ఎంఈవో, ఏఏఎంసీ, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం, సంబంధిత స్కూల్ హెచ్ఎంలతో ఎంపిక కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 15లోగా అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల ఎంపిక ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. మిగతా వికారాబాద్, పరిగి, తాండూరు నియోజకవర్గాల్లోనూ ఉపాధ్యాయ కొరత వేధిస్తున్నప్పటికీ సంబంధిత నియోజకవర్గాలను విస్మరించడంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

వానలు అంతంతే!

- అన్నదాతలను వెంటాడుతున్న వర్షాభావ పరిస్థితులు
- రంగారెడ్డి జిల్లాలో లోటు వర్షపాతం
- ఇప్పటివరకు 1.82లక్షల ఎకరాల్లోనే పంటల సాగు
- వరి సాగుకు వెనుకడుగు వేస్తున్న రైతాంగం

రంగారెడ్డి, ఆగస్టు 12(నమస్తే తెలంగాణ): ఈ ఏడాది రైతాంగానికి అంతగా కలిసి రావడం లేదు. గత యాసంగిలో అనావృష్టి పరిస్థితులతో నష్టాలను చవి చూసిన జిల్లా రైతాంగానికి వానకాలం సాగు సైతం ప్రతికూలంగా మారింది. వర్షాలు విస్తారంగా కురుస్తున్నట్లు కనిపిస్తున్నా.. రంగారెడ్డి జిల్లాలో మాత్రం సరైన వర్షాలు లేవు. వానకాలం ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా సరైన వర్షాలు లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 1.82లక్షల ఎకరాల్లోనే పంటలు సాగయ్యాయి. చెరువుల్లోకి కూడా చెప్పుకోదగ్గ స్థాయిలో నీరు చేరలేదు. ఇప్పటికే వరి నార్లు పోసిన రైతులు రోజూ చెరువుల వైపు చూస్తున్నారు. గత పరిస్థితుల దృష్ట్యా వరిసాగుకు వెనుకడుగు వేయాల్సి వస్తున్నది.

జిల్లాలో సాగు వివరాలు..

పంట	ఎకరాల్లో
వరి	19,500
పత్తి	1,10,563
జొన్నలు	2,913
మొక్కజొన్న	27,055
కందులు	5,009
మినుములు	18
పెసలు	14
చెరుకు	34
సోయాబిన్	17
ఇతర పంటలు	17,211

గణనీయంగా తగ్గనున్న సాగు విస్తీర్ణం..

వానకాలం సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గనున్నట్లు తెలుస్తున్నది. జిల్లాలో ఈసారి 2.94లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. కానీ.. ఇప్పటివరకు 1,82,334 ఎకరాల్లోనే పంటలు సాగయ్యాయి. లక్ష ఎకరాల్లో వరి సాగు కావాల్సి ఉండగా.. ఇప్పటివరకు కేవలం 19,500 ఎకరాల్లోనే సాగును మొదలుపెట్టారు. మరో 20,795 ఎకరాల్లో నారును సిద్ధం చేసి ఉంచారు. జిల్లాలో ఉన్న చెరువుల్లోకి సైతం ఆశించిన స్థాయిలో వరద నీరు రాలేదు. దీంతో మత్తడి పోసిన చెరువులు ప్రస్తుతానికైతే లేవు. దీంతో నార్లు పోసిన రైతులు సైతం సందిగ్ధంలో ఉన్నారు. జిల్లాలో బావులు, బోర్ల కింద వరి సాగు చేస్తున్న రైతులు ఈసారి సాగు విస్తీర్ణాన్ని తగ్గించుకుంటున్నారు. అత్యధికంగా పత్తి సాగు చేపట్టనున్నారు. పత్తిని 1.77లక్షల ఎకరాల్లో సాగు చేయాల్సి ఉండగా.. ఇప్పటివరకు 1.10లక్షల ఎకరాల్లోనే సాగు చేశారు. సీజన్ ముగిసేనాటికి 2 లక్షల ఎకరాలకు మించి పంటలు సాగయ్యే అవకాశం కనిపించడం లేదు. గత వానకాలంతో పోలిస్తే ఈసారి సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గనున్నది.

ఆగస్టుపైనే ఆశలు..

ఈ ఏడాది జిల్లాలో సాధారణ కంటే తక్కువ వర్షపాతం నమోదైంది. ఆమనగల్లు, తలకొండపల్లి, కేశంపేట మండలాల్లో మాత్రమే సాధారణం కంటే కొంత ఎక్కువ వర్షపాతం నమోదైంది. శంకర్‌పల్లి, శేరిలింగంపల్లి, హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్, మంచాల, మాడ్గుల, కడ్తాల్, మహేశ్వరం, మొయినాబాద్, చేవెళ్ల, షాబాద్, కొత్తూరు, నందిగామ, ఫరూఖ్‌నగర్, కొందుర్గు, చౌదరిగూడెం మండలాల్లో సాధారణ వర్షమే కురిసింది. గండిపేట, రాజేంద్రనగర్, బాలాపూర్, సరూర్‌నగర్, ఇబ్రహీంపట్నం, యాచారం, కందుకూరు, శంషాబాద్ మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. జూలై నాటికి 246.9 మి.మి.ల వర్షపాతం కురవాల్సి ఉండగా.. 201.0మి.మీ.లు మాత్రమే కురిసింది. సరైన వర్షాలు లేక భూగర్భ జలాలు పెరగలేదు. వ్యవసాయ బోర్లు సైతం రీఛార్జ్ కాలేదు. గత మే నెలలో 14.06 మీటర్ల లోతులో ఉన్న భూగర్భ జలాలు జూన్ నాటికి 13.99మీ.కి మాత్రమే పెరిగాయి. రాష్ట్రస్థాయిలో పరిశీలిస్తే.. రాష్ట్ర సగటు కంటే అధికంగా వానలు పడ్డట్లు కనిపిస్తున్నా.. జిల్లాలో మాత్రం ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదు. ఇక రైతులు ఆగస్టు నెలలో కురిసే వర్షాలపైనే ఆశలు పెట్టుకున్నారు.